164

# నాన్నగారి శవం

అవును. అది చంద్రనిప్పులు చేరగవలసిన మండు వేసవే. కానీ,

ఆ రోజెందుకోగాని భోరున వర్షవే! అరుకునుంచి శృంగారపు కోట వరకూ వర్షవే. తండ్రి చచ్చిపోయాడని టెల్లిగ్రాము వస్తే దట్సాల్ రైట్! టేక్ లీవ్ అండ్ గో అన్నారు కాని ఆ "గో" ఎలాగ? మీ నాన్నగారి శవానికి చేతుల్తో చితిముట్టించాల్సిన పనున్నపుడు ఆ అడివి నుంచి రెక్కలు కట్టుకుని ఎలా వాలగలరు? మీ అమ్మ దగ్గరుండాల

నుంచి మీకు మీ నాన్నగారి శవానికి కడసారి నమస్కరించాలనుంది మీకు. కాని ఎక్కడి నిడదవోలురాజుగారి ఆసుపత్రి. ఎక్కడి అరుకు వేలీ? గోలెత్తిపోయారు. కోడిగుడ్డుకోసం.కోడిగుడ్డు చిమ్నీల కోసం జీపుల్నితోలి పెట్రోలును మంచినీళ్ళలా కర్చు పెట్టే మీ ఆఫీసువారు మీకు బండినివ్వటానికి తటపటాయించేరు.

అది చంద్రనిప్పులు చెరగవలసిన మండు వేసవే.కాని ఆ రోజెందుకో వర్షంపడింది. ఆ వర్షంలో తడుస్తూ టెలిగ్రాఫ్ బంట్రోతు పిడుగులాటి వార్త తెచ్చాడు.

మీ నాన్నగారు పోయారని—.

మీ అమ్మవక్కర్తే ఆసుపత్రిలో వుందని-

ఒంటరిగా-నిస్సహాయురాలు. ఆడది కన్నతల్లి కడు దీనావస్థలో చిక్కడ్డది.

ఆ శవం - ఆవిడా. ఇద్దరూ.... కాదు ఒక్కర్తే ఏమైపోతోందో—

ఇక్కడా వర్షమే. ఎక్కడావర్షమే అయితే....

మీ నాన్నగారి శవం—

తెలిసింది. తరవాత తెలిసింది.

ఆసుపత్రినుంచి త్వరగా శవాన్ని వెంటనే తీసుకుపొమ్మన్నారనీ.

అప్పుడు—

"అయ్యో! అమ్మా! తల్లీ.తండ్రీ.నాయన్లారా-"

నేనాడదాన్ని నా కొడుకులు దూరాల్నున్నారు.

నే నేం చేసుకోనీ శవాన్ని....

బాబుల్లారా! నా యెడల కనికరించండి! ఎక్కడో పంచలో ఈ కట్టెను పెట్టుకొని నన్ను కూర్చుండనివ్వండి. చచ్చి మీ కడుపున పుడ్తాను. నావాళ్ళొస్తారు.

నా బిడ్డలొస్తారు.

వాళ్ళను కడసారి తండ్రిని చూసుకోనివ్వండి

నేనాడదాన్ని! దీనురాల్ని!

అంతమందీ వున్నా ఈ క్షణం యిప్పుడు యింత కష్టంలో మిమ్మల్ని చేతులెత్తి అభ్యర్థిస్తున్నాను.

మొక్కుకుంటున్నాను.

వేడుకుంటున్నాను.

ఈ శవాన్ని నేనేం చేసుకోను—

నాకు గాఢాంధకారం కమ్మేసింది. అన్నలారా అక్కలారా నాకు కళ్ళు కనపడటంలేదు.

అన్నా. బ్రతిమాలినా ఎవరి గుండె కరగలేదు. శవాన్ని రిక్షాలో వేసుకొని ఏడుస్తూ ఎంతో దర్జాగా హోషుగా బ్రతికిన ఇంటిగుమ్మం ముందర నట్ట నడి వీథిలో నేలమీద ఆ పుణ్యపురుషుడి భౌతికకాయాన్ని పెట్టుకుని కూర్చుంది. ఆ మహా ఇల్లాలు.

అంతటితోకసి తీరనట్లు—

ఆకాశం రంయ్ రంయ్ మని లేచింది. గాలి సుళ్ళు తిరిగింది. చెట్లు వెర్రిగా తలలూపాయి మనుష్యుల కర్కశాన్ని చూసో ఆ మహా యిల్లాలి కష్టం చూడలేకో ఆకాశం గుండెలు బ్రద్దలయికుండపోతగా వర్షం కురిసింది.

అయ్యో! అవును అది చంద్రనిప్పులు చెరగవలసిన మండు వేసవే. కాని ఎందుకో వర్షం కురుస్తోంది.

అప్పుడు మీనాన్నగారి శవం ఎవరూ స్నానం చేయించ నక్కర్లేకుండానే తడిసి బురదలో పొర్లాడింది.

అప్పుడు ఆ ఇల్లాలు మళ్ళీ అడిగింది—

"అమ్మా! అయ్యా! బాబూ!

మీ అరుగుమీద నా భర్త శవాన్ని పెట్టుకోనీయరండమ్మా! మీ మేలు మర్చిపోను. నా బిడ్డలు వచ్చేదాకా—నాకు దిక్కు తెలిసే వరకూ. పోనీ మీ కారుషెడ్డు తాళ లివ్వండమ్మా. ఆ పంచన ఆ శవాన్ని పెట్టుకుని కూర్చుంటాను.

ఆశ్చర్యంగా తలుపుతీనుకుని ముసుగుతన్ని పరున్నారు. చెట్టు క్రింద శవాన్ని అడదాన్ని వదిలేసి.

అప్పుడీ శవాన్ని వదిలించుకోవటం ఎలాగ? ఈ వర్షంలో ఎంతసేపు యిలా నేనీ చెట్టుక్రింద కూర్చుంటాను అని మీ అమ్మ వాపోయింది.

ఇంత కిరసనాయులు ఒకఅగ్గిపుల్ల గీస్తే పిడికెడు బూడిద అయి పోయే దానికి అరుగులూ, పంచలూ ఎందుకమ్మా అన్నారుట కొం దరు.

పుట్టడం, పుణ్యం, చావడం మహాపాపమా తెలియ కడుగుతాను? అద్దెఇళ్ళలో ఎవరూ చావకూడదా? సొంత ఇళ్ళ వాళ్ళేకాని మరెవరూ ఆ పుణ్యానికి నోచుకోలేదా?

మనతోటిప్రాణి అందులో అడది రారానికష్టంలో మొగుడు చచ్చి

దుఃఖిస్తూంటే సాయం చెయ్యడంపోయి యింతహింస పాల్జెయ్యడం ఇది భక్తా - ఇది మతమా? ఇది ఆచారమా? ఏమతం శవాన్ని చెట్టుక్రింద వీథిలో పారేసి దయాహీనంగా తలుపులు మూసుకోమని చెబుతుంది?

అంతా పిడికెడు బూడిద కావలసినవారే! చావుకో ఇల్లుపుట్టుకకో ఇల్లూ అనిరెండిళ్ళు ఎవరికీ లేవుగదా!

పోయినవ్యక్తి ఎటువంటి మనిషి! చీమకి అపకారం చేయని వాడే. పంతులుగారు పంతులుగారు అని తామంతా కూడాకూడా తిరిగారే! తమతో కష్టసుఖాల్ని పంచుకుని సంఘంలో ఎంతో మర్యాదగా మెసలిన ఒక పుణ్య పురుషుడ్ని సత్కరించే తీరు ఇదేనా!

ఆయనది-

నిండుమనమ్ము

నవ్యనవనీత సమానము పల్కు

దారుణా ఖండల శస్త్రతుల్యము

ఆ అవమానం చచ్చిన శవాని కెందుకవుతుంది? అది బ్రతికి వున్న సంఘానిది? ఈ సంఘం ఎంత కుళ్ళిపోయిందో - ఇది పాడు ఆచారాలు దుర్మార్గపుటలవాట్లతో ఎలా క్రూరంగా పాషాణసదృశంగా దీనులు హీనులపట్ల ప్రవర్తిస్తుందో తల్చుకుంటూంటే ఈ దేవుళ్ళ. ఈభోగాలూ ఈ తంతులన్నీ వట్టి బూటాకాలూ. నాటకాలూ, దొంగెత్తులూ, టక్కర్లూనని నా కనిపిస్తోవుంటుంది, నిజం కూడా—

మానవత్వం లేక పోయాక. జాతి, కులం, మతం వుంటేనేమి, పోతేనేవమి.

చచ్చిన శవానికేమీ అక్కర్లేదు — ఆ మాట నిజమే!

కానీ లేని అసహాయుల్ని నిస్సహాయస్థితిలో చెట్టుక్రింద శవాన్ని పెట్టుకు కూర్చోమన్న మీ జాతులూ, గొప్పలూ వుంటేనేం? తగలద్దేనేం? ఇటువంటి సమాజానికి ఒక నిప్పుపుల్ల గీసే రోజు ఎప్పుడొస్తుంది? చప్పునొస్తుందా!

చివరకు ఎవరెవరో వచ్చారు.

ఆ శవాన్ని మీ అమ్మఒళ్లో నుంచి లాక్కుని తీసికెళ్ళి పిడికెడు బూడిద చేశారు.

ఆ మర్నాడుఉదయం — మనం చేరుకున్నాం గొల్లుమంటూ,

ఏడుస్తూ ఆ బూడిదను ఎత్తిపోయాడానికి వెళ్ళేరు మీరు.

అది మండు వేసవి. ఆవేళ ఆకాశం చంద్రం చంద్రం తీవ్ర తీవ్రంగా వుంది.

అప్పుడంతా మీనాన్నగారి కిలా అయిందాఅని మిమ్మల్ని ఓదార్చారు. మళ్ళీ అంతా ముఖాలకు మేలురకం చిరునవ్వులు, ముసుగులు తగిలించు కున్నారు.

"విపులాచ పృథ్వీ" - ఇంత విశాలమైనది కదా-పృధ్వి - ఎక్కడ చచ్చిపోతేనేం?

ఏ శవాన్నైనా కిరసనాయిలు పోసి అగ్గిపుల గీసి తగలేసేదలే— ఆ అగ్గిపుల్ల గీయడానికి, మంత్రసాని పురుడు పోయాడానికి మధ్య కలదే మానవజాతి సజీవ చరిత్ర —

పురిటి మంచం మీదనుంచి వల్లకాట్లో చేరే వరకూ కల చిర సంఘర్షణే మానవ జీవితం — అన్నా మానవ జీవితం! అప్పుడా

ఇల్లాలు తీవ్రముగా శపించింది. మానవ సమాజాన్ని. మానవ నాగరికతనూ. మనుష్యుల భేషజాన్ని. దొంగెత్తుల్నీ. నంగిరి పింగిరి మాటల్నీ. మాయా నాటకాలనూ మోసాల్నీ అభిశంసిస్తూ—

అద్దెకొంపల్లో ఉన్నవారూ. సొంతకొంపల్లో వారూ. పేవు మెంట్లమీద బ్రతికినవారూ. చెట్ల క్రింద సంసారాలుచేసే దీనులూ హీనులూ అంతా ఊళ్ళోంచి కాట్లోకిపోవలసినవారే! ఈ మాత్రానికి-జాతుల్ని. మతాన్ని. దేవుడ్ని. ఆచారాల్నీ అడ్డు పెట్టుకుని అన్నలారా అమ్మలారా! అక్కలారా! దొంగనాటకా లాడకండి-పీకలు తరించకండి! బూడిదలో పన్నీరు పోయకండి! మీరంతా సంతోషంగా వుండాలి నిజమే. అందుకు కొంపల్లో చిచ్చు పెట్టకండి.

—నాయన్లారా కాస్త జాలి చూపించండి తోటివారిమీద. తండ్రులారా దయ వుంచండి. తోటి మనుష్యుల్ని నమిలి మ్రింగకండి.

అవునుఅది చంద్ర నిప్పులు చెరగవలసిన మండువేసవి. కాని ఆరోజెందుకోగాని మీ నాన్నగారి శవంమీద దివినుండి భువికి దేవతలు వర్షం కురిపించారు.